ధా - ధా - ధూ - ధూ - డ్యామ్‌సోల్
అన్ని ఎక్స్‌పెరిమెంట్లూ అన్‌సక్సెస్‌ఫుల్ !!
ఎట్లా ? ఇంకెట్లా ? ?

కాలజ్ఞాని —

మూడో ప్రపంచ యుద్ధం వచ్చిందంటే
మహారణక్షోభం యేర్పడిందంటే
'కర్మభూమి' కరువై పోతుంది
'దేవభూమి' దైన్యం చెందుతుంది.
తరువాతి తరంవారి పరిమాణంలో కనిపిస్తుంది కొరత -
పోతుంది పరికరాల ప్రభావం
అవుతుంది పరిస్థితులే తారుమారు
కాలూనదు ధర్మం - హెచ్చుతుంది బుద్ధి మాంద్యం.
యేర్పడుతుంది దారి, రాతియుగంలోకి -
వస్తాము మనం - మళ్ళీ మొదటికి
కల్క్యవతారం - కలియుగ సమాప్తి.
బ్రహ్మ ప్రళయం - నూతన సృష్టి.
కృతత్రేతాద్వాపర కలియుగాలే -
యథాప్రకారం - మళ్ళీ
దశావతారాలే - ఇట్లే - ఇట్లే....
అని తత్వం చెబుతాడు.

## క వి + త

కవి —

ఏంవ్రాయను ? నేనేమని వ్రాయను ? ?
శత్రుభీకర శస్త్రాగ్ని జ్వాలలు -
ఘోర భయంకర సమర జీమూతమ్ములు -
క్రూర కర్కశ శనిగ్రహమ్ములు -
నా సరిహద్దులను చుట్టుముట్టినపుడు -
నాయింటకుడిచి - నేపోసిన పాలుత్రావి

నాయింటి వాసాలులెక్కించగల నయవంచకులు -
నన్నేకాటు వేయగల ఘోరభుజంగమ్ములు -
నా హద్దులలోనే వున్నప్పుడు -
ఏంవ్రాయను ? నేనేమని వ్రాయను.

కవిత —

ఓకవీ! సుకవీ!!
దిగులుచెందకు - నీవు.
నిస్పృహపడకు
సరసశృంగార రసపట్టులో
'మత్తేభ - సింహేంద్ర మధ్యాది' పద్యరచన కూడదు -
నీ వునికికే ప్రమాదం ఆసన్నమైనప్పుడు మామూలు రచనకూడదు.
నాభాషా భాండాగారమ్ములో ఎనలేని శబ్ద శస్త్ర సంచయమున్నది
వాటిని ఏర్చి - కూర్చి నీ ప్రజల ఉద్రేకాన్ని ఉత్తేజపరచు.
నీ ఒక్కొక్క కలంపోటు కొన్నికోట్లగుండెల్ని కదనరంగానికి కదలించనీ
నీ ఒక్కొక్క ప్రబోధగీతం భారత జాతిని యేకోన్ముఖం చేయనీ
నీ ఒక్కొక్కగీతిక వారుణాస్త్రమై శత్రు శస్త్రాగ్ని జ్వాలల్ని ఆర్పివేయనీ
నీ ఒక్కొక్క నినాదం
'వాయువ్య'మై శత్రుసమర జీమూతమ్ముల విచ్ఛిన్నం చేయనీ.

ఇకనుంచీ నీలక్ష్యం యిదే -
'భుజంగ విక్రీడితమ్ము'- నీపాట
'రుద్రమూర్తి ప్రళయకాల ప్రచండతాండవమ్ము'- నీఆట
'కదన కుతూహలమ్ము'- నీరాగం
'శత్రుసంహారం'- నీధ్యేయం
ఇక సాగించు నీరచన -
ఇక మ్రోగించు యుద్ధభేరి
ఇక కదిలించు ప్రజని
కదనరంగానికి నీ కవనంతో.

# రచయిత సమస్య

జీవితపు లావాదేవీలో అనుభవాల బాలెన్స్‌షీటు తయారు చేస్తే -
నేను నేర్చుకోవలసినవే ఎక్కువగా కనబడతాయి
నేర్చుకున్న వాటికంటె.

వడ్డీలేని అప్పుగా ఎన్నోరచనల్ని 'అడ్వాన్స్' చేశాను.
చివరికి అన్నీ జమకావాల్సిన 'డ్యూ - టు' అయిటమ్స్‌గానే కనిపించాయ్
ఏనాటికో ఒకనాటికి అన్నీ వసూలవుతాయన్న ఆశావాదిగా మిగిలాను.

పాత పద్ధతులేం బావుండలేదు; క్రొత్త దారేదైనా చూడాలి
కష్టమైన, క్లిష్టమైన వాటిని అతిసులభంగా సాధించాలి.
ఇక ఆ ప్రయత్నమే మనది.

మానవుడికంటే ముందునుంచీ వున్నది చరిత్ర - అయితే
దాన్ని అతడెలా వ్రాశాడన్నది అసలు ప్రశ్న కాదు.
నన్ను గురించిన నాలుగుముక్కలూ కాస్త బాగా వ్రాసేట్లు
చరిత్ర కాయదికాక హెచ్చరిక చేయాలి.

రచయితకాక కథావస్తువు - 'శూన్యం'
దీన్ని గురించి ఎక్కడ బడితే అక్కడ వ్రాయాలి -
ఎంత 'ఆబ్‌స్ట్రాక్ట్'గా వ్రాస్తే అంత మంచిది.
ఎవ్వరికీ అర్థం కాకపోయేదే మేటికవిత!

నెహ్రూలాలేని ఇక్కడ జీవించడమెట్లా? - ఒక మీమాంస.
ఎక్కడికైనా 'కవిత' చేత్తోబట్టుకొని వలస వెళ్లాలంటే -
నెహ్రూలు ఇక్కడకాక మరెక్కడా ఉద్భవించరు గద!
కాబట్టి ఈ దేశంలోనే మనమకాం!

నేను వ్రాసింది కొంచెం అర్థమయితే నీవు పండితుడివే.
పూర్తిగా అర్థంచేసుకొంటే నీకు నీవేసాటి
ఏమీ అర్థంకాకపోతే నీవు మేటి.

## కర్తవ్యం

జీవితపు సోపానాల మధ్యభాగాన నిలచి
గడచిన అనుభవాలని నూతనం చేసుకొంటున్నాను
జ్ఞాపకాల బూజు తెరలని తొలగిస్తున్నాను.

ఈ సృష్టికి అర్థమేమిటో తెలియలేదు
ఈ కల్పనకి కారణం కనిపించటంలేదు.
జీవితానికీ - తర్కానికీ అంగరందటం లేదు.
అప్పుడే కన్నులు మసకలై పోతున్నాయ్
ఇంకా ఎక్కవలసిన మెట్లెన్నివున్నాయో సరిగా అగుపించటం లేదు -
జీవితానికి గమ్యం మృగ్యం కాదుకదా ?

ఇంకా చేయవలసిన పనులెన్నో వున్నాయ్
అభ్యుదయానికి అర్థం వెతకాలి -
నాగరికతని నిర్వచించాలి.
'యువత'కి అక్షరాభ్యాసం చేసి,
'నవత'కి వాఙ్మయపు మెరుగులు దిద్ది,
భయంకర నిశ్శబ్దంలోని
సంగీతపు సరిగమల్ని సవరించి,
బ్రతుక్కీ - బయొనెట్ పాయింట్‌కీ సమన్వయం కుదిర్చి,
నాకు వర్తించేంత వరకూ
మారణహోమాగ్ని మంత్రం కూడా పఠించి,
వ్యర్థపుటాలోచనలకి స్వస్తి వాచకం పలకాలి.

## ఏమని వ్రాయను?

అణుయుగమ్మిది -
వీ 'స్పేస్ ఏజ్' - అనీ అంటున్నారు.
చి పరమాణువును సైతం ఛేదించి,
క ప్రకృతిని జయించి,
జు (అ) పరబ్రహ్మనైనానని -
★ నేటి మానవుడనుకొంటున్న యిపుడు
 ఏంవ్రాయను ? నేనేమని వ్రాయను ??

శాంతికాముకులెంత మొత్తుకున్నా శాంతించక, గ్రహించక -
'ఎవరు గొప్ప?' - 'ఎవరి బాంబు విధ్వంసక శక్తి యెక్కువ?'
అనుపోటీగా యుద్ధ సన్నద్ధులవుతూవుంటే -
ఇక నాగరికతేమూలేద్పింది ?
అణ్వస్త్రాల నిన్వెంట్ చేయువాడే ఈ కాలంలో నాగరికుడు -
ఆ దేశమే 'ఫార్ అడ్వాన్స్డ్'.

ఈ నవీనకాలంలో, నవనాగరిక ప్రపంచంలో
నాగరికుడనిపించుకొను నవయువకునకు
అధర్వణ వేదము ఊడుపుగత్తె
అది అతని చేతిలో కీలుబొమ్మ.

# స్వగతం

నేను అంతమవక్కర్లేదు.
నా పాంచ భౌతికమైన శరీరం పంచభూతాలలో ఐక్యమైతే
ప్రపంచమొక అభ్యుదయ రచయితని కోల్పోవచ్చు -
అప్పుడు-నేనింకా వ్రాయదలచిన మహాకావ్యాలని, వ్రాసేదెవ్వరు?

నేను చావక్కర్లేదు-
నాలో మేటిరాజకీయవేత్త ఉన్నాడో - కాక మహాశిల్పి,
అదియుగాక మహావేదాంతి, దాగి వుండొచ్చుగా!

నే నిక్కడ నుంచి వెళితే
'ఫేర్‌ప్రైస్' అంగడి వద్ద 'క్యూ'లో
తాత్కాలికంగా ఒక 'సంఖ్య' తగ్గవచ్చు-అయితే
నా వంతు వచ్చేసరికి 'స్టాక్' అయిపోవనూ వచ్చు!

కానీ-నేలేకపోతే
నాకు జరిగిన అన్యాయాల్ని జగతికి చాటేదెవ్వరు ?
జాతి జీవన తంత్రుల్ని సరియైన కృతిలో మీటేదెవ్వరు ??
కాబట్టి—
'నేను జీవించి ఏంలాభం?' అనేది ప్రశ్నకాదు—
నేను జీవించాలి-అంతేకాక నీవూ బ్రతకాలి.

చేతకాక – ఏడుస్తూ కూర్చుంటే లాభంలేదు.
నీ మనసు లోతుల్లోకి తొంగిచూడు.
ఇంతవరకు బ్రతుకులో చవిచూసిన
అనుభవాల్ని నెమరువేసుకో.
నీవు కన్నీరు కారిస్తే తుడిచే చేయిలేదు –
నీవే నీ కన్నీటి కణాల్ని, చిరిగిన చొక్కా అంచుతో
అద్దుకునే అలవాటుచేసికో.
సానుభూతికోసం నలుగురివేపూ చూడకు.
అందరూ తమ సమస్యలతోనే సతమతమవుతున్నారు.
నిన్నుగురించి ఆలోచించే వారెవ్వరూలేరు.
నిన్ను నీవే వుపశమింప జేసికోవడం –
నీపై నీవే జాలిపడడం నేర్చుకో !
నీ మీద నీవే 'విట్టు' వేసుకుని
లోలోపలే గట్టిగా నవ్వడం నేర్చుకో !

ప్రసంగకుశలత నీకే కలదని
నలుగురి ఎదుటా చమత్కరిస్తే –
వారు నీ మాటల్ని అర్థం చేసికోకపోతే –
నీవు మరీ ఏడవాల్సి వుంటుంది.
నిప్పులాంటి నిజంలోని
చల్లటి అందాన్ని
అనుభవించడం నేర్చుకో !

## సమదృష్టి

వీ చంద్రాస్య సుమధురయౌవతాధర ధారలొక్కటే నాకు రుచికాదు.
చి ప్రజ్వల జ్వలితవిషధార కూడ రుచియె.
క నవవికసిత శతపత్ర దీప్తి మిళిత లతాంగిని
లు మధుకర శ్రేణి వేణి యొక్కటే నాకు స్పృశ్యతార్హముకాదు.
★ ఘనభోదీప్తభాసమాన మణిప్రభా మిళితదంష్ట్రాకార
 ఘోరభుజంగము కూడ స్పృశ్యతార్హమె.

నిన్ననే నిదురలో మనకగా కనవచ్చి,
"నేటి కవిత్వమున్ గనిన
నాకును గూడ నదేలకో
నచ్చెరువయ్యె. చూడ
ఏటికో యీనాటి కవులందరున్
నన్నిట్టు జేపట్టి బల్మిన్
అయిష్ట భూషణాలంకారగాజేతు
రెట్లయిన నీ వొక్కపరి, పోనీ—
నన్నే జేయూతగాగొని, వారిన్
సత్కావన మార్గాభియుక్తులన్ జేయవే"
యంచు అరఘడియ
అచ్చుగా కన్నీరు గార్చి
అల్లదే చనెన్.

అటులేగిన మీదటన్ ఒక్కపరియైనన్ పోల్చిచూతమా
నాటి కావ్యాల నీనాటి వాటితోనని తత్కార్యమ్మునకై
గడంగ, అక్కటా, చోద్యంబయ్యె నదేటికో!
హస్తిమశకాంతరంబొ, కాక అజగజాంతరంబొ, లేక....
ఏమిచెప్పనెనలేని శూన్యప్రదేశ మాయా కావ్యాలనడుమన్.

ఈనాటి కవులిట్లు దుడ్డుకర్రలన్ గైకొని
పద్యముల నడుములన్ విరుగగొట్టుచు నుండ
ఇక చెప్పంజాల

నాగుండె ఎండింది
నా యెదద మండింది
దృగ్గోళకాల్లోని
కన్నీరు యింకింది—,
నానడుమున్ వున్నదున్నట్లు నునుచుటకునై
యేరచనయుగాని
దిక్కుమాలిన యీగేయ పద్య గద్యాత్మకమునకై గడంగితిన్
అస్మద్స్వప్న వృత్తాంతానువాదార్థమై.

ఒకరిపై పెద్దచూపు.
మరొకరిపై చిన్నచూపు - చూపులా
హెచ్చుతగ్గుల భేదంలేని
జ్యోత్స్నను జోకొట్టేసింది దేశం.

అంతటా అమావాస్య ఆవరించిన
ఈ దేశం చరిత్ర రాత్రిలో
చుట్టూరావున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడంకంటె
ప్రయత్నించి, ఎంత చిన్నదీపాన్నయినా -
వెలిగించి, వెలుతురును ప్రసాదించి,
జ్యోత్స్నను నిదురలేపే ఓ జ్యోతిని వెలిగించడం కావాలి!
అది కలకాలం నిలవాలి!
మనకు మార్గదర్శి కావాలి!

# అల వైకుంఠ పురంబులో ...

హే భగవాన్!
ఏమిటయ్యా యిది?
'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'
అంటూ ఏనాడో మాటిచ్చావు
ఇదేనా?
ఇక్కడ - ఇదే ఈ భూలోకంలో
ఇప్పుడు, "అవినీతి"-పాపం! పీకలదాకా మాత్రమే నిండి,
అధికారం చెలాయిస్తోంటే,
జన్మించవేం మరి?
ఇచ్చినమాట గుర్తురావడం లేదా?
మరిచావా?
లేక మాట నిలకడలేదా?
లేక ఈ మనుష్యులకి నువ్వూ భయపడుతున్నట్టున్నావ్
లేకుంటే
'అల వైకుంఠపురంబులో నగరిలో ఆమూల
సౌధంబు దాపల' దాక్కున్నందుకా
నీ కిక్కడి సంగతి - మా గతి తెలియడంలేదు.

ఇరవైయొక్క ఏళ్లక్రితం,
ముచ్చటయిన రంగులతో, మచ్చలేని మనసులతో
త్యాగనిరతులు భారతికి నేసిచ్చిన స్వాతంత్ర్య పతాకం
మళ్ళీ మరోసారి నేడు, ఎగురుతోంది
ఆనాటి కళకళలు కనబడవు.
తన కదలికలో నేడు తడబాటు కనిపిస్తుంది.
అందరికీ కనిపించేట్టు
రెండు మూడుసార్లు ఎంతో దుఃఖంతో
మధ్యకు దిగింది పతాకం ఈ మధ్య.
మళ్ళీ ఎగురుతోంది
కానీ నా కనిపిస్తోంది -
మళ్ళీ పైకెదగకుండా అక్కడే నిలిచి, ఎగురుతోందని
రెపరెపలాడుతోంది ! -
దౌర్జన్యాలధాటికి తట్టుకోలేక,
అసహాయతను ప్రదర్శిస్తూ, విలవిలలాడుతోంది.
పూర్వపు ఆనందపు స్థితి చేరుకోలేక
అనవత శిరస్కయై ఎగురుతోంది
ఈనాడు - మళ్ళీ ఎగురుతోంది !

బంగారుపుట్టలో వేలుపెట్టి కెలికిన
పిల్లవాడ్ని కుట్టిన చీమ అసలుకథ
కథ చెప్పినవాడికేనా తెలుసోలేదో ? కానీ -
కొత్త చీమలకథ అందరికీ తెలుసు
స్వార్థపరులు, సంస్కారదరిద్రులు కెలికిన, దుశ్శీలాల పుట్టలోంచి,
అవినీతి, అధర్మం, స్వార్థం, హింస, దరిద్రం, అశాంతుల
చీమల బారులు,
అందరినీ కరుస్తున్నాయి.
భారతికి కష్టం కలిగిస్తున్నాయి.
కరవడం కరవడమే అయినా
కరవడం కరవడంలో తేడావుంది.
సామాన్యుడిని మరింత కసితో

అసామాన్యంగా, అమానుషంగా కదుస్తున్నాయి.
చీమ చిటుక్కుమంటే
ఉలికులికి పడుతున్నాడు.
చీమలుకుట్టిన బాధకు
కేకలేస్తున్నాడు నేడు
భారతికష్టం చూపలేనందుకు
ఏడుస్తున్నాడు నేడు.

నాటికీ నేటికీ. నక్కకూ నాగలోకానికీ
వున్న తేడా కనిపిస్తోంది.
ఆనాటి నేతలు పతాకం నేతకై
తమ జీవితాల సుఖశాంతులు
పడుగు పేకగా పేర్చిన నేతలు
ఈనాడు ఎందుకో నేతల చేతులు
అందుకోలేకపోతున్నాయ్ నా రాతలు.

భారతి కన్నీళ్ళు తుడిచే ఓపిక
సామాన్యుడు తెచ్చుకోవాలి !
చీమలు కుట్టినందుకే నిర్వీర్యులయ్యే వ్యాపారం మానుకోవాలి.
చేసిన దోషాలకు తూర్పున తర్పణం వదలి.
భారతికి అదేరంగులతో
సరికొత్త చీరనేసి పెట్టేందుకు
అసలుదోషులను, చీమలను
పుట్టల్లోకి కలుగుల్లోకి నెట్టి
కత్తిలేని సిమెంటుతో పూడ్చిపెట్టి
ఆ గోరీల తలలపై భవిష్యత్తుకు పునాదులేద్దాం !
ఆ పునాదులపై నిర్మించిన, భవనాల్లో,
సువిశాల సహృదయ, ఆవరణాల్లో
నిస్వార్థపు దూది ఏకి,
కొత్తనేత మొదలెడదాం
నేడే! ఈనాడే సరికొత్త నేత మొదలెడదాం

# కనీస కోర్కెలు

ఖరాబయిన ప్రపంచంలో
ఖరీదయిన నేనెందుకని
నిజాయితీ నిలిచిపోయింది
పరమార్థం పరారయింది.

ఖరీదయిన ధరలు ధరలో
దరహాసం చిలికిస్తుంటే
దండుగ నేనెందుకంటూ
ధర్మం దాగిపోయింది.

కష్టానికి ఫలితందక్కే
సిస్టం ఇంకా రానప్పుడు
నిలుకడ నా కెక్కడని
న్యాయం నశించిపోయింది.

హార్టులో వుండేదొకటి
కోర్టులో చెప్పేదొకటి
గెలిచేది అసత్యం అయితే
సత్యం సతమతమౌతోంది.

మాంసభక్షకులు మిక్కుటమై
మూషికాలసైతం భక్షిస్తుంటే
మాలిన్యం పేరిన అహింసామూర్తి
వినీలాకాశంలో బజ్జుంది.

దయ, ధర్మం: న్యాయం, క్రమం
సత్యం, అహింస అలాంటివన్నీ
కార్మికుల కనీసకోర్కెల్లా
అజగద్రాక్కబడి అరిపోతున్నాయ్!

నువ్వు రాజుకొనే పొయ్యివి
మేము పొయ్యిలో మిగిలిన బూడిదకప్పుకున్న, చల్లారిన నిప్పులం,
విను బాబూ! విను! ఆ పందిట్లో మంగళవాద్యం – పవిత్రత
నువ్వేకాదు! నీ రాబోయే వారికీ వినిపించు
వినిపించు మంగళ వాద్యం!

## నిరాశావాది

చిగురించిన కోరికలు, ఆశించిన ఆశయాలు –
తలచింది జరుగదు, జరిగింది తెలియదు
అధోగతికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టింది జీవితం
నీరుకారిపోయే నిరాశావాదిని చేసింది జీవితం

రాత్రంతా కన్నకలల్ని
ఉదయం వాస్తవాలుగా మార్చేయత్నంలో
కలలుకోసం వేసిన వలలు, కదలి అలల్లాగా
నా పాదాల్నితాకి నన్నువదలి వెళ్ళిపోయాయి.
వలజారిన చెయ్యి, చెమర్చిన కంటికితోడుగా
చెమటను మిగిల్చిపోయింది
కంటతడి బెట్టించి ఆశావాదిని కాకుండాచేసింది జీవితం

కన్నకలలకీ, విన్నమాటలకీ నిలుకడలేదు
నిరాశతోకూడిన అలుక
అసమర్థత అసహాయత పైకెక్కి నర్తిస్తోంది.
ఎముకదొరకని కుక్కవలికే
వేదాంతపు మాటలని మిగిల్చి 'భ్రష్టవాదిని' చేసిపోయింది జీవితం.

తమ చేతకానివి నా చేత చేయించాలని
సహృదయంతో పంతంపట్టిన
నా ఆప్త బృందానికి –
దురదృష్టదేవత నిర్భాగ్య సామ్రాజ్యానికి
వారసుణ్ణని దీవించేట్టు చేసుకున్నందుకు
అందిరానికాలం నా సౌభాగ్యంతో

